andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 . కనిష్ఠం 22.5

నిర్మల్

జిల్లా వార్తలు

8

శనివారం 7 డిసెంబరు 2024



ప్రతిపాదనలు పక్కకు



ఖానాపూర్ వద్ద గోదావరి నది

- జిల్లాలో పరివాహక గ్రామాలను వరద నుంచి రక్షించేందుకు 'గోడ' ప్రణాళిక
- 40 కిలో మీటర్ల పొడవుతో గోదావరికి ఇరువైపులా నిర్మాణానికి ప్రపోజల్స్
- రూ. 70 కోట్లతో కరకట్టల అంచనాలు
- గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన కరకట్టల ప్రతిపాదన
- కాంగ్రెస్ ప్రభుత్వం పైనే ఆశలు

నిర్మల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీఏటా వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్న గోదావరి నది పరివాహక గ్రామాలను ఆ వరద నుంచి రక్షించేందుకు ఇరిగేషన్ అధికారులు గత రెండేళ్ల క్రితం పకడ్బందీ ప్రతిపాదనలను రూపొందించారు. అప్పటి బీఆర్ఎస్ సర్కార్‌కు నివేదించారు. ఇదిలా ఉండగా ఏళ్ల నుంచి గోదావరి పరివాహక గ్రామాలను వరద ముప్పు వెంటాడుతున్న క్రమంలో ఇరిగేషన్ అధికారులు కరకట్టల నిర్మాణ అంశానికి ప్రాధాన్యత నిచ్చారు. ప్రతీ వర్షాకాలంలో వరద ముప్పు అధికారులకు అటు పరివాహక గ్రామాల ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్న అంశాన్ని ఆఫీసర్లు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల దిగువ నుంచి మొదలయ్యే గోదావరి నది ఖానాపూర్ వరకు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ మహారాష్ట్ర నుంచి వరద ఉధృతి పెరగడంతో ఈ ప్రాజెక్టు గేట్లు పైకెత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేస్తుంటారు. ఒకేసారి లక్షల క్యూసెక్కుల నీరు వరద రూపంలో ప్రవహిస్తున్న కారణంగా గోదావరి నది ఉప్పొంగుతుంటుంది. ఈ సమయంలో నదికి ఇరువైపులా ఉన్న పరివాహక గ్రామాలన్నీ వరద ముంపునకు గురవుతుండడం.. భారీ ఎత్తున నష్టపోవడం సర్వసాధారణమవుతోంది. ప్రధానంగా మత్స్యకారులు, అలాగే పశువుల కాపరులతో పాటు నదికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలంతా వర్షాకాలంలో ముప్పును ఎదుర్కొంటుండడం.. ప్రభుత్వాలపై పరీవాహక ప్రజలు నిరాశను వ్యక్తం చేయడం సర్వసాధారణమైపోయింది. దాదాపు 15 గ్రామాలకు పైగా ప్రతీ ఏటా గోదావరి నది వరద కారణంగా ముంపునకు గురవతున్నాయి. దీంతో పాటు పరోక్షంగా మరికొన్ని గ్రామాలు కూడా ఇబ్బందుల పాలవుతున్నాయి. గోదావరి నది పరివాహక గ్రామాలను వరద నుంచి కాపాడేందుకు అధికారులు భద్రాచలం తరహాలో కరకట్టల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. బీఆర్ఎస్ సర్కారు దీనిపై ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించింది. భద్రాచలంలో గోదావరినది వరద ఉధృతి నుంచి ఆ ప్రాంతాన్ని కాపాడేందుకు నిర్మించిన కరకట్టలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్న అంశాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు జిల్లాలోని గోదావరి నదికి ఇరువైపులా కూడా అలాంటి కరకట్టలను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు అందించారు.

40 కిలోమీటర్ల పొడవుతో..


సోన్ నుంచి ప్రారంభమయ్యే గోదావరి నది ఖానాపూర్ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవుతో ప్రవహిస్తుంటుంది. ఈ నలభై కిలోమీటర్ల పొడవును పరిగణలోకి తీసుకున్న అధికారులు మొత్తం నదికి ఇరువైపులా కరకట్టలను నిర్మించాలని యోచిస్తున్నారు. దీనికోసం గాను దాదాపు 70 కోట్ల రూపాయల వరకు వ్యయం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. అయితే భద్రాచలంలో నిర్మించిన కరకట్టల తరహాలోనే కాకుండా మరింత శాస్త్రీయతను జోడించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటూ ఈ నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తున్నారు.

15 గ్రామాలకు వరద ముప్పు..

ప్రతీఏటా గోదావరి నది వరద ఉధృతి కారణంగా ఈ నది పరివాహకంలోని దాదాపు 15 గ్రామాలు ప్రత్యక్షంగా ముంపునకు గురవుతుండగా మరికొన్ని గ్రామాలు పరోక్షంగా ప్రభావితమవుతున్నాయి. సోన్ నుంచి మొదలుకొని కూచన్‌పల్లి, ధర్మారం, పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్ చందా, మామడ మండలంలోని కమల్‌కోట్, పొన్కల్, ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్, మేడంపల్లి, బాదన్‌కుర్తి, ఖానాపూర్ గ్రామాలు గోదావరి నది ప్రవాహ ఉధృతికి ప్రతీ ఏటా ముంపు బారిన పడుతున్నాయి. ఈ గ్రామాలతో పాటు గోదావరి నదికి ఉపనది అయిన స్వర్ణ నది పరివాహకంలోని గ్రామాలు కూడా ముంపు బారిన పడుతున్నాయి. స్వర్ణప్రాజెక్టు నుంచి మాదాపూర్ వరకు గల గ్రామాలతో పాటు నిర్మల్ పట్టంలోని జీఎన్‌ఆర్ కాలనీ కూడా వరద ఉధృతికి ముంపునకు గురవుతోంది.

కాంగ్రెస్ సర్కారుపై ఆశలు..

అయితే గోదావరి నది పరివాహక ప్రాంతాలను వరద ముప్పు నుంచి కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఇటు అధికారులు, అటు స్థానికులు కోరుతున్నారు. ఈ కరకట్టల నిర్మాణ ప్రతిపాదనలను అప్పటి బీఆర్ఎస్ సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ అంశానికి ప్రాధాన్యతనివ్వాలని వీరంతా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే వరదల వల్ల జరుగుతున్న నష్టంపై సీరియస్‌గా స్పందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కరకట్టల నిర్మాణాలకు మోక్షం కల్పించవచ్చని స్థానికులు ఆశిస్తున్నారు.



భద్రాచలం సమీపంలో గోదావరి నది ఒడ్డున నిర్మిస్తున్న కరకట్ట (ఫైల్)

పోలీసులు అందిస్తున్న సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ప్రజలకు పోలీసుశాఖ అందిస్తున్న పలు సేవలపై వాసవి హైస్కూల్ విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్పీ ఆదేశం మేరకు శుక్రవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, బాంబు డిస్పోజల్స్, డయల్ 100 నెంబర్ తదితర వాటిపై వివరించారు.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామ్‌నిరంజన్, బాంబు స్క్వాడ్ టీమ్ రమేష్ రాథోడ్, రమణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గమ్మ తల్లికి మొక్కులు చెల్లించిన మహిళలు



మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

దిలావర్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లి శివారులో ఉన్న దుర్గమ్మ తల్లికి శుక్రవారం గుండంపల్లి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ రద్దయితే కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటామని గతంలో పోలీసుల నిఘా నేత్రాల మధ్య దుర్గమ్మ దేవాలయానికి వెళ్లి మొక్కుకున్నారు. వారు అనుకుననట్లే ఇథనాల్ పరిశ్రమ రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం గ్రామంలోని మహిళలు సామూహికంగా కాలినడకన వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నేడు ఆటోల బంద్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా శనివారం తలపెట్టిన ఆటోల బంద్ జయప్రదం చేయాలని టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న కోరారు. శుక్రవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆటోల డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సైదుద్దీన్, అజీమ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే ప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- భైంసా ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్

భైంసా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన తీరుతో పాలన కొనసాగిస్తున్న రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వానికి రోజురోజుకు పెరుగుతున్న ప్రజాకర్షణ చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాదరణ అధికమవుతున్న నేపథ్యంలో ఉనికిని కోల్పోతామనే ఆందోళనతో ప్రతిపక్షాలు అర్థరహిత ఆరోపణలు, చవకబారు విమర్శలకు దిగుతున్నాయని దుయ్యబట్టారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రేవంత్‌రెడ్డి సర్కార్ కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమం చేపట్టిందన్నారు. గ్యారంటీల అమలుతో అన్ని వర్గాల మద్దతును కూడగట్టుకుంటోందన్నారు. దీంతో బెంబేలెత్తిపోతున్న ప్రతిపక్షాలు అసహనంతో దుష్ప్రచారాని తెరలేపాయన్నారు. ఒక వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్రపూరిత విధానాలతో ముందుకు సాగుతున్నాయన్నారు. సంక్షేమాన్ని, సంస్కరణలు అడ్డుకునేందుకు దిగజారుడు విధానాలను అవలంబిస్తున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు కె.శ్రీహరిరావ్ మాట్లాడుతూ జనరంజక పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకర్షక సర్కార్‌గా అన్ని వర్గాలకు చేరువయ్యిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విధ్వంసకర పాలన కొనసాగగా ప్రస్తుత రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతమైన పాలనను అందిస్తోందన్నారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న సంక్షేమపాలన, ఆదర్శ అభివృద్ధితో ప్రతిపక్ష పార్టీలు అసహనంతో రగిలిపోతున్నాయన్నారు. ఓర్వలేని తనంతో చవకబారు విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ముథోల్ నియోజక వర్గానికి మంజూరవుతున్న అభివృద్ధి పనులతో బెంబెలెత్తిపోతున్న కొంత మంది బీజేపీ ప్రతినిధులు దిగజారుడు విధానాలతో ఇష్టరాజ్యంగా ఆరోపణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. రెండు పర్యాయాలు తాను ఎమ్మెల్యేగానున్న సమయంలో ఎలాంటి అభివృద్ధి చేపట్టానో ఆరోపణలకు దిగుతున్న బీజేపీ ప్రతినిధులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, మాజీ జడ్పీ చైర్మెన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, సమత ఫౌండేషన్ చైర్మెన్ సమత సుదర్శన్‌ల నేతృత్వంలో ఏఐసీసీ ప్రతినిధి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఏఐసీసీ ప్రతినిధి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. నూతనంగా ఎన్నుకోబడిన యూత్ కాంగ్రెస్ కార్యవర్గ ప్రతినిదులకు ఘనంగా సన్మానించారు. రేవంత్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.



భైంసాలో రాహుల్, రేవంత్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

బాలశక్తి కార్యక్రమాన్ని నిరంతరం పకడ్బందీగా కొనసాగించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాలశక్తి కార్యక్రమాన్ని నిరంతరం పకడ్బందీగా కొనసాగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమంపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, అన్ని రకాల పరీక్షలను నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో వ్యాధులను గుర్తించినట్లయితే వాటికి సంబంధించిన మందులను సిఫారసు చేయాలన్నారు. వ్యాధులను నిర్ధారించడమే కాకుండా నివారణ కోసం మందులు, పోషకాలను తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆరోగ్య కార్డులను తయారు చేసి, తల్లిదండ్రులకు వారి ఆరోగ్య స్థితిగతులను వివరించాలన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు నిర్వహించిన రోగ నిర్ధారణ పరీక్షలు, అందించిన పోషకాలు, మందుల గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆర్థిక అక్షరాస్యత మెరుగుపరిచేందుకు గాను బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయిలో దశలవారీగా విద్యార్థులకు రోజువారి బ్యాంకు లావాదేవీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు రుణాలు, సైబర్ నేరాలపై పరిజ్ఞానం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, భారత ఎన్నికల విధానం వంటి విషయాలపై అవగాహన కల్పించేలా వ్యాసరచన పోటీలను నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులచే నమూనా పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాలశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో పి. రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, డీఆర్డీవో విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, విద్య, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులు కేటాయించిన ప్రదేశాల్లోనే వ్యాపారాన్ని నిర్వహించుకోవాలి

పట్టణంలోని వీధి వ్యాపారులు తమకు కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే తమ వ్యాపారాన్ని నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్‌శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కూరగాయాలు, పండ్లు, పూలు ఇతర వీధి వ్యాపారస్థులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే తమ వ్యాపారాన్ని చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై వ్యాపారాన్ని నిర్వహించరాదన్నారు. పట్టణంలో పార్కింగ్ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, పార్కింగ్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. షాపింగ్‌మాల్, ఇతర వ్యాపార సముదాయాల్లో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. వెజ్, నాన్ వెజ్ వ్యాపారులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే తమ వ్యాపారాలు చేసుకోవాలని తెలిపారు. చేపల మార్కెట్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి తరువాత రైతు భరోసా ఇస్తాం

డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు



లక్ష్మణచాందలోని రైతువేదికలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగ తరువాత రైతుభరోసా పథకం అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైతు పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని పది నెలల్లో చేసి చూపించామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200ల యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రెండు లక్షల లోపు రుణమాఫీ తదితర పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. సంక్రాంతి అనంతరం ఎకరానికి రూ.7,500ల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. రానున్న కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయటంతో పాటు మెరుగైన పాలనను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపెల్లి భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు కోంద్ర నరేష్ రెడ్డి, గురాల లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట

దిలావర్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం న్యూ లోలంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని దశల వారీగా అమలు చేస్తూ కాంగ్రెస్ సర్కారు ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన పది సంవత్సరాల కాలంలో రూ. లక్ష రైతు రుణమాఫీ చేయలేక చతికిల పడ్డాడని, కానీ రేవంత్‌రెడ్డి సర్కారు పది నెలల్లోనే రూ. రెండు లక్షల రుణమాఫీ చేసి అన్నదాతల రుణం తీర్చుకుందన్నారు.

నేటి యువతకు బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తి..

నేటి యువతరం భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. న్యూ లోలంలో జరిగిన డా. అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సాయన్న, సీనియర్ నాయకులు కే. రాజారెడ్డి, స్వామిగౌడ్, అనిల్, కృష్ణ, శ్రీహరి, ఏ. రమణ, మహేందర్, దయాకర్, సలీం, కదిలి దేవస్థానం చైర్మన్ వెంకట్‌రావు పటేల్, కాల్వ దేవస్థానం డైరెక్టర్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్సాపూర్(జి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్షీరాభిషేకం చేశారు. పది సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధి, సంక్షేమ పనులను పది నెలల్లోనే చేసి చూపించిన గొప్ప సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, కోంద్ర రమేష్, మంగ్లారపు మల్లేష్, సాగర్, గోవిందరెడ్డి, సంతోష్, సమత సుదర్శన్, ఉమా మహేష్, రఘు, గజ్జారాం పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్

భైంసా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ సూచించారు. ప్రజా పాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయమం, నడక , యోగా సాధన చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకొని వాటి బారిన పడకుండా ఉండేందుకు గాను ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మాత్రలను పంపిణీ చేశారు. ఇందులో మున్సిపల్ మేనేజర్ గౌరీష్ కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అనీస్ అహ్మద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాత్రలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్



మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసమే అభిప్రాయ సేకరణ

● రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి

ఉట్నూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టాలన్న విద్యా సంస్కరణల పై ఉపాధ్యాయుల, విద్యావేత్తలు అభిప్రాయాలు సేకరించడం జరుగుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో విద్యా వ్యవస్థలో అమలవుతున్న కార్యక్రమాలు, విద్యా వ్యవస్థలో చేపట్టబోయే సంస్కరణల పై ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను విలీనం చేయాలని, బహు విషయ బహుళ బోధన ఉండకుండా తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, పాఠశాల విద్యను ఇంటర్మీడియట్‌లో విలీనం చేయాలని, ఒక మండలాల్లోని అన్ని మేనేజ్మెంట్‌లో ఒకే సూపర్‌వైజింగ్ నడిచేలా చూడాలని, పాఠశాల విద్యా ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించాలని, జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, తదితర విషయాల పై ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించడం జరిగిందన్నారు. సమాజ నిర్మాణంలో విద్యా వ్యవస్థను ఇప్పుడున్న దానికంటే ఇంకా పునాది భాగుచేస్తే అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిసా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌చార్జీ డీడీ వసంతరావుజాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

● జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్

నార్నూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వజూనియర్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలని అకస్మీకంగా తనిఖీ చేసి కళాశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లు క్షుణంగా పరిశీలించి పలు సలహా సూచనలు అందించారు. పరీక్షలో విద్యార్థులు మంచి మార్కులుతో పాస్ కావాలని కళాశాలకు మంచి పేరు జిల్లాలో వచ్చేలా సిబ్బంది అందరు కలిసి పని చేయాలనిఆదేశించారు. వారి వెంట డీఐఈఓ సూపరింటెండెంట్ మురళిధర్ ప్రిన్సిపల్ వెంకటకేశవులు అధ్యాపకులు బాలాజి కాంబ్లె వెంకటరమణ ,నరేష్, సుజాత దితరులున్నారు.

అదనపు తరగతి గది ప్రారంభం

నేరడిగొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటపూర్ గ్రామంలో పాఠశాల మరమ్మత్తులు, నూతన అదనపు తరగతి గదిని రూ.17.70 లక్షలతో నిర్మించి శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అదనపు గది ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని రేపటి భవిష్యత్తు వారిదేనని అన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని గ్రామానికి మంచిపేరు తీసుకురావలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ఇచ్చోడలో నివాళులర్పిస్తున్న నాయకులు


సుంకిడిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అంబేద్కర్‌కు ఘన నివాళి

● అంబేద్కర్ అందరివాడు : ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

తాంసి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ అందరివాడని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తాంసిలో అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపినప్పుడే అంబేద్కర్ కన్న కలలకు సహకారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు తారుడి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, అశోక్, ముత్తన్న, లింగన్న, అడెల్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి జిల్లా, మండల నాయకలు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ ఇచ్చోడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అంబేద్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, టేకుల రాజు, మచ్చ గంగయ్య, పెరుమాండ్ల నారాయణ, అన్నెల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

● అంబేద్కర్ సహకారంతోనే నేడు ప్రగతి ఫలాలు

తలమడుగు(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితోనే నేడు ప్రతి ఒక్కరికి ప్రగతి ఫలాలు లభిస్తున్నాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ అపార మేధావి అంబేద్కర్ కష్టపడి రాజ్యాంగాన్ని నిర్మించడంతోనే ప్రతి ఒక్కరికి ప్రగతి ఫలాలు అందుతున్నాయన్నారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

● పేదల సంక్షేమం కోసం పాటుపడ్డ అంబేద్కర్

బోథ్(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం పరితపించిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని ఆయన రాసిన రాజ్యాంగం ఎంతో ముందు చూపుతో రాయడం జరిగిందని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీటీసీ సంధ్యారాణి చేతుల మీదుగా రోగులకు పండ్లను పంపిణీ చేశారు. సోనాలలో జరిగిన కార్యక్రమంలో మెరుగు ప్రభాకర్, బిస్వామి, దేవిదాస్, కిరణ్, రాహుల్, శివ, రేవంత్, తదితరులు పాల్గొన్నారు. బోథ్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ మండల యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన మండల అధ్యక్షుడు ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు చంటి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● నేరడిగొండలో నాయకుల నివాళి

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్పాల గ్రామంలో రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఓరగంటి రాజు, ఉపాధ్యాయుడు ఉడుగుల అభిలాష్, ప్రధాన కార్యదర్శి ఒడ్డేపల్లిసురేష్, గ్రామస్థులు లింగంపల్లిసురేష్, గస్కంటి కిష్టయ్య, చుంచురవి, సింగారం లస్మన్న, తిరుమలేష్, ఉడుగుల సురేష్, దావుల శివయ్య చిర్రగంగయ్య, కొండ గంగయ్య,లింగంపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, నార్నూర్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లితో పాటు పలు మండలాల్లో అంబేద్కర్‌కు ఘన నివాళ్లు అర్పించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

నేరడిగొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు కేజీబీవీ నేరడిగొండకు చెందిన ఆరుగు విద్యార్థినిలు ఆర్.శ్రీలేఖ, శిరీష, జె.అనిత, టి.శిరీషా, ఎం.శ్రీనిత్య, బి.వనితలు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 7, 8 వరకు జడ్పీహెచ్ఎస్ అర్మూర్, నిజామాబాద్‌జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారని ప్రత్యేక అధికారి రజిత తెలిపారు. పీఈటీ స్నేహ, ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలను అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.

'ప్రభుత్వం బీసీ బంధును కొనసాగించాలి'

బోథ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ బందు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఈ విషయమై స్థానిక డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ బందు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో సహకార సంఘం డైరెక్టర్ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు ఓరుగంటి స్వామి, న్యాయవాది మల్లెపూల స్వామిలు ఉన్నారు.

పత్తి రైతులకు మంచి రోజులు

(5వ పేజీ తరువాయి...)

ప్రతిపాదనలు పంపించారు. దీంతో అన్ని రకాలుగా పరిశీలించిన కేంద్రం తాజాగా పత్తి పరిశోధన ఉపకేంద్రాన్ని మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో జిల్లా పరిశోధన స్థానం అధికారిగా పనిచేసిన శ్రీధర్ చౌహాన్ పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటుపై ప్రత్యేకదృష్టిని సారించారు. ఆయన చొరవతోనే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసేందుకు 15నుంచి 30ఎకరాల సాగు భూమితో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉన్న పరిశోధన స్థానంలో అవసరమైన అన్నిరకాల వసతులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ముఖ్యంగా జిల్లా రైతులు పత్తి పంటలో ఎదుర్కొంటున్న గులాబీ రంగు పురుగు ఉధృతి నియంత్రణకు చర్యలు చేపట్టే అవకాశం ఉందంటున్నారు.


ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆడే గజేందర్, వడ్డెర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

ఘనంగా వడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామంలో శుక్రవారం ప్రథమ స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విగ్రహ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘంలో కాని గ్రామంలో కాని ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రజల సమస్యల పరిష్కారానికి తనను ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. కార్యక్రమంలో వడ్డెర జాతి రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రాజు, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు, ట్రస్ట్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, సహకార సంఘం చైర్మన్ దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ, రాజేశ్వర్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, పిడుగు అభిరామిరెడ్డి, కేద్రేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, కిరణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, వడ్డెర సంఘం అధ్యక్షులు రాజమల్లు, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణంలో ఏసీబీ ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏసీబీ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏసీబీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. లంచం తీసుకోవడం, ఇవ్వడం నేరమంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థపానకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరామన్నారు. ఆర్డీవో వినోద్ కుమార్, ఏసీబీ సీఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ మార్కండేయ, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నిర్వహించండి : ఎంఈవో

భోథ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నిర్వహించాలని మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దన్నూర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ పాఠశాల నిర్వహణపై సూచనలు అందించారు.


భానాపూర్ పాత బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సత్యం


భైంసాలో అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించి నినాదాలు చేస్తున్న దళిత, వివిధ సంఘాల ప్రతినిధులు


లోకేశ్వరంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ జిల్లాలో అంబేద్కర్‌కు ఘన నివాళి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ 68వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగిస్తున్నారని అన్నారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, కే. శ్రావణ్, ఆడెపు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి : చైర్మన్ ఈశ్వర్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. వారి అభ్యున్నతికి అంబేద్కర్ కృషి చేశారన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించారన్నారు. ముడుసు సత్యనారాయణ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన బీఆర్ఎస్...

ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నియోజకవర్గ కన్వీనర్ కే. రాంకిషన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు డాక్టర్ సుభాష్ రావు, నరహరి, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఐక్య వేదిక సంఘ నాయకులు శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్దగల విగ్రహానికి నివాళులర్పించారు. అంబేద్కర్ రాజ్యాన్ని తీసుకురావడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళులని నాయకులు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నిగులపు లింగన్న, ప్రధాన కార్యదర్శి పి. రాజేష్, ఎస్. ప్రభాకర్, దర్శనం ప్రవీణ్ పాల్గొన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంఎస్పీ కోఆర్డినేటర్ శనిగారపు రవి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన మహా నాయకుడని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. రాజు, సాయన్న, గంగాధర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఖానాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం సహా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో, భూక్యా జాన్సన్ నాయక్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేరు వేరు కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ మేష సతీష్, నియోజకవర్గ కన్వీనర్ మునుగూరి ప్రణీత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జన్నారపు శంకర్, ద్యావతి రాజేశ్వర్, గొర్రె గంగాధర్, మేసు గంగేష్, నేత శ్యామ్, రాజేశ్వర్, రాజ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న, పట్టణ అధ్యక్షులు గోరేకర్ రాజు, నాయకులు రహీం, షఫీ, బాబర్, హర్ష, రాజ్ కుమార్, మహిపాల్, లాజర్, తదితరులున్నారు.

అంబేద్కర్ అందరికి ఆదర్శప్రాయుడు

భైంసా,డిసెంబరు 6: డివిజన్ పరిధిలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బి.ఆర్ . అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భైంసా బస్టాండ్ ఎదుట గల బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, దళిత సంఘాలు, ఉద్యోగ, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భైంసా బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో సమత ఫౌండేషన్ చైర్మెన్ సమత సుదర్శన్‌తో పాటు పలువురు దళిత సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిదులు అంబేద్కర్ దళితుల అభ్యున్నతికి అనిర్వచనీయమైన సేవలందించారని కొనియాడారు.

సీపీఎం ఆధ్వర్యంలో ..

లోకేశ్వరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. లోకేశ్వరం మండలంలోని జోహర్‌పూర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయన్న, గజ్జన్న, తరుణ్, గంగాధర్, చిన్నన్న, లక్ష్మణ్, శ్రీనివాస్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు కొవ్వొత్తులతో నివాళి

మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం సభ్యులు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషి వల్లే బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ కూడా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వరం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు.


తానూర్ పోలీసుస్టేషన్‌లో..


పెంబి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఇటిక్యాల గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్ రెడ్డి, నాయకులు మల్లపెల్లి స్వామి, బోరె రమేష్, మాజీ ఎంపీటీసీ రాజేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గోధూరి సరోజ, తోకల మహేందర్, అశోక్, ధర్మరాజు, రమేష్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన..

దిలావర్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామ గ్రామాన డా. బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల అంబేద్కర్ సంఘం నాయకులు సప్పల రవి, బొల్ల దయాకర్ దళిత సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తానూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు శుక్రవారం మండల ఎస్సై రమేష్ ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ 68వ వర్ధంతిని పురష్కరించుకొని పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

కుంటాల, డిసెంబరు, 6 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరు, అందకూర్ తదితర గ్రామాలలో శుక్రవారం డా. బీఆర్. అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.


కల్లూరు గ్రామంలో నివాళులర్పిస్తున్న నాయకులు

డయల్ 100పై అవగాహన

లక్ష్మణచాంద, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాబాపూర్ గ్రామంలో సైబర్ క్రైమ్, డయల్ 100పై ఎస్సై సుమలత శుక్రవారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలపై కూడా అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ అశోక్, సంతోష్, మధు, తదితరులు హాజరయ్యారు.

రూ. 2.55 లక్షల విలువ గల స్వర్గరథాన్ని

విరాళంగా ఇచ్చిన అయిండ్ల భీమ్‌రెడ్డి ట్రస్ట్

లక్ష్మణచాంద, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామానికి రూ. 2.55 లక్షల విలువ గల స్వర్గ రథాన్ని (అంత్యక్రియలకు ఉపయోగించే వాహనం) అయిండ్ల భీమ్ రెడ్డి ట్రస్ట్ శుక్రవారం విరాళంగా ఇచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ దివంగత అయిండ్ల భీమ్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అయిండ్ల గీతాంజలి - భూపాల్‌రెడ్డి, కుమార్తెలు ప్రముఖ వైద్యురాలు పత్తిరెడ్డి స్వర్ణ - విజయ భాస్కర్ రెడ్డి, వంగ జ్యోతి - సుభాష్ రెడ్డి, పత్తిరెడ్డి శైలజ - వేణుగోపాల్ రెడ్డిలు ఇందుకు సంబంధించిన నిధులు సమకూర్చి ఏబీఆర్ ట్రస్ ద్వారా ఈ వాహనాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి గ్రామ వీడీసీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిపెల్లి మాజీ సర్పంచ్ కమల్‌కోట వెంకట్‌రెడ్డి, వీడీసీ సభ్యులు పోచమ్మల ప్రశాంత్, కొయ్యల మధు రెడ్డి, చిన్నారులు రాజు, తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా సమరసింహారెడ్డి

నిర్మల్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన పొద్దుటూరి సమరసింహారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం సాయంత్రం జరిగిన ఎన్నికల్లో 2,135 ఓట్ల మెజార్టీతో సమరసింహారెడ్డి గెలుపొందారు. సమరసింహారెడ్డి కుటుంబ సభ్యులు సైతం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ వివిధ పదవులు నిర్వర్తించారు. తండ్రి పీవీ రమణారెడ్డి... జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే.శ్రీహరిరావుకు అత్యంత సన్నిహితులు. ఈయన గతంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పరిమండల్ గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. అలాగే మామడ మండల పీఏసీఎస్ చైర్మన్‌గా కూడా కొనసాగారు. సమరసింహారెడ్డి తల్లి మంగారాణి సైతం మామడ మండల పరిషత్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. పూర్తిగా కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చిన సమరసింహారెడ్డి ప్రస్తుతం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల పలువురు పార్టీ ముఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్ ప్రారంభం

తానూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లో శుక్రవారం ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాలలో రాణించాలని, మహిళలకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, మాజీ సర్పంచ్‌లు పోతారెడ్డి, మాదవ్‌రావుపటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ పుండ్లీక్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఏపీఎం గంగాధర్, ఏపీవో సీసీలు, వీవోఏలు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల రిలే దీక్ష

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు రిలే నిరాహార దీక్ష శుక్రవారం ఐదవ రోజు కొనసాగింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొనసాగిన ఆందోళనలో కళ్లు మూసుకొని నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్ మాట్లాడుతూ... ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మేనిఫెస్టోలో హామీ మేరకు నెలసరి వేతనం 10 వేల రూపాయలు చెల్లింపు, కోడి గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మొనవ్వ, రజిత, భాగ్య, లక్ష్మీ, హంస, మానస, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య శిబిరం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఐఎంఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు డిపో ప్రాంగణంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 90 మంది పరీక్షలు చేయించుకున్నారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్ తదితర పరీక్షలు చేశారు. 12 మందికి 2డి ఎకో, 18 ఈసీజీ నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. డీఎం ప్రతిమారెడ్డి, వైద్యులు దామెర రాములు, ముఖేష్, ప్రసాద్ వాగ్మారే, దయాకర్ యాదవ్, శ్రీనివాస్ (కార్డియాలజిస్ట్), ప్రభాకర్‌రావు, వేణుగోపాలకృష్ణ, ప్రవీణ్ వైద్య పరీక్షలు చేశారు. అధ్యక్షుడు మురళీధర్, కార్యదర్శి ప్రమోద్ చంద్రారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



ఆశాజనకంగా కనిపిస్తున్న శనగ పంట

శనగ పంటపైనే రైతుల ఆశలు

● పెరగనున్న సాగు విస్తీర్ణం ● ఆశాజనకంగా శనగ పంట

తాంసి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటనే నమ్ముకున్న రైతాంగానికి ఈ ఏడు కష్టాలతోపాటు నష్టాలు ఎదురయ్యాయి. అయితే శనగ పంటపైనే అన్నదాతలు ఆశలు పెటుకున్నారు. ప్రస్తుతం శనగ పంటకు కావాల్సిన రీతిలో వాతావరణ పరిస్థితులు ఉండటంతో ఆశాజనకంగా కన్పిస్తోంది. కనీసం తమ కష్టాలను శనగపంట అయిన తీరుస్తుందని ఆశతో ఉన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంత్సరం శనగ సాగు విస్తీరణం గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చు. మండలంలో ఈసారి సుమారు మూడు వేల హెక్టార్లలో శనగ సాగు అవుతుంది. కొంత మంది రైతుల శనగ విత్తనాలు నాటి 30 నుంచి 35 రోజులు కావస్తోంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉండటంతో రైతుల ఆశలన్నీ శనగ పంటపైనే ఆధారపడి ఉన్నాయి. ఇంకా కొంత మంది వారి వారి చేన్‌లలో ఉన్న పత్తిని తొలగించి శనగ సాగు కోసం సన్నద్ధమవుతున్నారు.

● పెరిగిన సాగు విస్తీర్ణం

గతంలో పోలిస్తే ఈ సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని చెప్పవచ్చు. మూడు నెలల ముందుగానే పత్తి పంట పూర్తి అవడంతో రైతులు ఆ పత్తి పంటను తొలగించి శనగ సాగుకు సమాయత్తమవుతున్నారు. సుమారు 50 వేల హెక్టార్‌లలో సాగు అయ్యేలా కనిపిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. మొత్తం మీద శనగ పంటపై రైతులు ఆసక్తి చూపడం, శనగ పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ఉండటంతో పాటు వారి వారి మండలాల్లో కొనుగోలు చేయడంతో కూడా ఈ పంటపై రైతులు మొగ్గు చూపుతున్నారని చెప్పవచ్చు.



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు



ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్, డీఈవో, ఇతర ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

వైజ్ఞానిక ప్రదర్శనలతో..

విద్యార్థుల్లో సృజనాత్మకత

● నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ● అట్టహాసంగా సైన్స్ ఫెయిర్ ప్రారంభం ● ఆకట్టుకున్న ప్రదర్శనలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో ఇన్స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా తన సందేశంలో విద్యార్థులను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, కొత్త విషయాలు నేర్చుకోవాలన్న తపన, శోధన, పరిశీలన లాంటివి పెంపొందించుకోవాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు ఇలాంటి వాటికి బీజం వేస్తాయన్నారు. ఆచరణాత్మక విద్యను అందించాలన్నారు. దానితో సొంత ఆలోచనలతో వైజ్ఞానిక ఆవిష్కరణలు చేస్తారని స్పష్టంచేశారు. ఆ దిశగా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పని చేసి రెండు రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనకు తమ ఎక్స్‌బిట్లు తీసుకువచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. విద్యార్థులతో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు కలెక్టర్, అతి థులు తిలకించి అభినందించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ఆహ్వతులకు స్వాగతం పలికారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమన్‌అలీ, డీఈవో రామారావు, తహసీల్దార్ రాజు, విద్యాశాఖల అధికారులు, పద్మ, సలోమి కరుణ, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉపాధ్యాయసంఘ ప్రతినిధులు, తదితరులు తరలివచ్చారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



పంపు వెనుకా సోలార్ సిస్టమ్



సోలార్ పంపుతో స్ప్రే చేస్తున్న రైతు

మార్కెట్‌లోకి సోలార్ స్ప్రే పంపులు

● సబ్సిడీపై అందించాలని రైతుల డిమాండ్

తాంసి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్‌లోకి సోలార్ స్ప్రే పంపులు వచ్చేశాయి. దీంతో ఎక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయని రైతులు అంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో కొంతమంది వీటిని హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసుకుని వచ్చి పంట పొలాల్లో స్ప్రే చేస్తున్నారు. పంటలకు పురుగు మందు స్ప్రే చేస్తున్న రైతును పలకరించగా ఎలాంటి ఛార్జింగ్ అవసరం లేదని దానంతటా అదే ఛార్జింగ్ అవుతూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్ప్రే పంపుతో ఎంతసేపైనా పంటకు పిచికారి చేయవచ్చని తెలిపారు. దీని ధర ప్రస్తుతం ఎనిమిది నుంచి తొమ్మిది వేలకు కొనుగోలు చేశామని తెలిపారు. సోలార్ పంపును చూసి పలువురు రైతులు ఆయన వద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

● ప్రభుత్వం సబ్సిడీతో ఇవ్వాలి

ప్రస్తుతం మార్కెట్‌లోకి సోలార్ స్ప్రే పంపులు వచ్చాయని, వీటిని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు. వీటిని 75 శాతం సబ్సిడీపై అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతు ప్రభుత్వం పేరిట అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో స్పందించాలని రైతులు కోరుతున్నారు.

లోకేశ్వరంలో భారీ వర్షం

● తడిసి ముద్దయిన వరి ధాన్యం ● ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలంటున్న రైతులు



లోకేశ్వరంలో తడిసిన వరి ధాన్యం



కుంటాలలో కళ్లాల్లో తడిసిన ధాన్యం

లోకేశ్వరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు వరి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరారు.

కుంటాలలో అకాల వర్షం

కుంటాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలోని అందకూర్, కల్లూర్‌తో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా అకాల వర్షం కురిసింది. దీంతో రైతుల యొక్క కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ఒక్కసారిగా వర్షం కురియడంతో రైతులు ఆందోళనలకు గురయ్యారు. ఇప్పటికే రైతులు తమ పంట పొలాల్లో రబీ సీజన్‌లో విత్తనాలు విత్తుకునేందుకు బీజీగా ఉన్న సమయంలో వర్షం అకస్మాత్తుగా కురియడంతో చాలా గ్రామాల్లో కళ్లాల్లో ధాన్యం తడిసి ముద్దయింది.

చిరుజల్లులకు వణికిన సోయా రైతులు

బోథ్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం చిరు జల్లులు కురవడంతో సోయాబీన్ పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులు వణికిపోయారు. ఆకస్మికంగా చిరు జల్లులు కురవడం వల్ల పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు.

● లారీలు లేక..

గత నాలుగు రోజుల నుంచి పంటను అమ్ముకునే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్‌లో పంట తూకం పూర్తయిన బస్తాలను కుట్టడంలో జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. మరో వైపు సోయాబీన్ పంటను తరలించేందుకు లారీ లేకపోవడంతో రైతు సోయాబీన్ బస్తాలకు కాపలాగా ఉండాల్సి వస్తుంది.

● అధికారులు చొరవ చూపాలి

కొనుగోలు చేసిన పంటను సకాలంలో గోడౌన్‌లోకి తరలించేందుకు అధికారులు చొరవ చూపించాలని రైతులు కోరుతున్నారు. స్థానికంగా లారీల కొరత ఉండటంతో ఇతర ప్రాంతాలన ఉంచి లారీలను తెప్పించాలని అంటున్నారు. రోజుల తరబడి తూకం పూర్తయిన ఇక్కడే ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

● రెండు రోజుల్లో తరలిస్తాం

రైతుల వద్ద కొనుగోలు చేసిన సోయాబీన్ పంటను రెండు రోజుల్లో తరలించే ఏర్పాట్లు చేస్తామని సెంటర్ ఇంచార్జి గోలి స్వామి తెలిపారు. లారీల కొరత వల్ల కొంత జాప్యం జరిగిందని, ఒక రోజు గన్ని బ్యాగులు సకాలంలో రాకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని సహకరించాలని కోరారు.



కేజీబీవీలో నిరుపయోగంగా ఉన్న ఆర్వోప్లాంట్

పని చేయని ఆర్వో ప్లాంట్

● వాటర్‌ప్లాంట్ నుంచి పాఠశాలకు నిత్యం డబ్బాలలో నీటి సరఫరా

బజార్‌హత్నూర్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు స్వచ్ఛమైన నీరును అందించేందుకు ప్రతీ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు ప్రభుత్వం ఒక ఆర్వో ప్లాంట్‌ను మంజూరుచేసి పంపిణీ చేసింది. కానీ బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దీంతో విద్యార్థినులకు తాగునీటిని గ్రామంలోని వాటర్ ప్లాంట్ నుంచి డబ్బాల ద్వారా తీసుకువచ్చి పాఠశాలలో నిల్వచేసుకుని ఉపయోగించుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చేక్రమంలో ఎక్కడైనా కలుషితం జరిగితే విద్యార్థినుల ప్రాణాలకే ప్రమాదకరంగా మారవచ్చని మండలవాసులు వాపోతున్నారు. కేజీబీవీ పాఠశాలలో నిరుపయోగంగా పడి ఉన్న ఆర్వోప్లాంట్‌ను బాగుచేయించి విద్యార్థినులకు సురక్షితమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లితండ్రులు కోరుతున్నారు.



తాగునీటి సరఫరాకు ఉపయోగిస్తున్న నాసిరకమైన డబ్బాలు



ఇచ్చోడలోని అయ్యప్ప ఆలయం

అయ్యప్ప ఆలయంలో ఆధ్యాత్మిక శోభ

● ప్రతీ బుధవారం నిత్య అన్నదానం ● రేపు 10వ ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): దిన దినాభివృద్ధి చెందుతూ.. మండలంలో అందమైన, సుందరమైన, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని మహిమాన్విత ఆలయంగా ఇచ్చోడలోని అయ్యప్ప ఆలయం కీర్తి పొందుతోంది. అయ్యప్ప దీక్షలు, భక్తుల భజనలు, ప్రత్యేక పూజలు.. నిత్య బుధవారం అన్నదానం.. విశాలమైన ప్రాంగణంతో ఆ ప్రాంతమంతా అధ్యాత్మిక శోభను సంతరించుకుంటోంది. మదిలో ఓ భక్తిభావం.. దైవచింతనలో పడి పరవశించిపోతాం.. ఆలయంలో నిత్యం శుద్ధి, పవిత్రత పెరుగుతూ క్రమేపి ఆలయం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతూ భక్తజనంతో సందడి నెలకొంటుంది. ఏటా కార్తీక మాసం సందర్భంగా ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు.

ప్రతీ బుధవారం ఆలయంలో భిక్షా సదుపాయం

అయ్యప్ప ఆలయంలో ప్రతీ బుధవారం అయ్యప్పస్వామికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నదానం జరుపుతున్నారు. ఆలయంలో ప్రత్యేకమైన వంటశాలను నిర్మించారు. అన్నదాన సమయంలో వంటలు మొదలుకుని వడ్డన, పాత్రలు కడిగే వరకు యువత, పేద, ధనిక తేడా లేకుండా అందరు స్వచ్ఛందంగా వచ్చి ఆలయంలో పలు రకాల సేవలు చేస్తుంటారు.

నేడు మహా భిక్షా, మహా పడిపూజ

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులందరూ కలిసి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు అయ్యప్ప ఆరట్టు కార్యక్రమం మొదలుకొని ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో స్వామివారి పల్లకీ ఊరేగింపును పురస్కరించుకొని మధ్యాహ్నం స్వామివారికి స్థానిక కడెం నదిలో చక్రస్నానం ఆచరించడం జరుగుతుంది. అనంతరం అయ్యప్ప ఆలయ అవరణలో జాతర సందర్భంగా మహాభిక్ష నిర్వహిస్తారు. సాయంత్రం అయ్యప్ప స్వామి దివ్య పదునెట్టాంబడి కార్యక్రమం నిర్వహించి జ్యోతి స్వరూపుడికి పడిదీపాలు ముట్టించి ప్రత్యేక మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇచ్చోడ అయ్యప్ప ఆలయం మండల కేంద్రంతో పాటు సిరికొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి అయ్యప్ప మాలధారులు భక్తులు హాజరై పడిపూజ భజన బృందంలో పాల్గొంటారు.

భావితరాలకు ఆదర్శప్రాయుడు అంబేద్కర్

● ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ బాసరలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని మహాపరినిర్వాన్ దివస్‌గా పరిగణిస్తూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ మురళీ దర్శన్ తో కలిసి డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ నవ భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ అని, ఆయన యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని అభివర్ణించారు. నవభారత నిర్మాణంలో డా. బీఆర్ అంబేద్కర్ పోషించిన పాత్ర విశేషమైందన్నారు. భారతీయ సమాజానికి, ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వ రంగాలలో అంబేద్కర్ చేసిన కృషి, అందించిన సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. సాధికారత, సామాజిక చైతన్యానికి విద్య కీలకమని, దానికి అంబేద్కర్ నిదర్శనమని అన్నారు. విద్యావంతులుగా మన విద్యార్థులు విద్యను విద్యను పొందడానికి మన బాధ్యత, భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన సమానత్వం, న్యాయం సౌభ్రాతృత్వపు విలువలను కాపాడుకోవడం ప్రజాస్వామ్య హక్కులని తెలిపారు. వివక్ష, అసమానతలు లేని సమాజం కోసం విద్యార్థులు, అధ్యాపకులు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఐటీఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళి దర్శన్ మాట్లాడుతూ న్యాయమైన సమానమైన సమాజం కోసం డాక్టర్ అంబేద్కర్ యొక్క విజన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమ్మిళిత ఆర్థిక వృద్ధి సామాజిక అభివృద్ధి అవకాశాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏవో రణధీర్ సాగి, సెల్ కన్వీనర్ డా. అజయ్, సభ్యులు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, యూనివర్సిటీ సిబ్బంది



ఇటీవల కేంద్ర ప్రభుత్వం.. అఖిల భారతీయ సమన్వయ పథకం (ఏఐసీఆర్‌పీ) కింద రెండు పత్తి పరిశోధన కేంద్రాలను మంజూరు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో వరంగల్‌లో ప్రధాన పరిశోధన కేంద్రం కాగా, జిల్లాకు ఉప పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. దీంతో జిల్లా పత్తి రైతులకు మంచి రోజులు వచ్చాయని అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- జిల్లాకు పత్తి పరిశోధన ఉప కేంద్రం మంజూరు
- మేలు రకం బీటీ విత్తనాల వృద్ధికి అవకాశం
- ఇప్పటికే అందుబాటులోకి సోయా పరిశోధన కేంద్రం
- లోతైన పరిశోధనలతో పత్తి రైతులకు మరింత ప్రయోజనం
- జిల్లావ్యాప్తంగా యేటా 30 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి



పత్తి రైతులకు.. మంచి రోజులు

ఆదిలాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగయ్యే పంటలలో ప్రధానంగా పత్తి పంట సాగు కనిపిస్తోంది. వర్షాధార, నీటి ఆధార పంటగా పండించే పత్తి సాగు పైననే జిల్లా రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5లక్షల 72వేల ఎకరాలు కాగా.. ఇందులో అధికంగా 4లక్షల 34వేల ఎకరాలలో పత్తి పంట సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో యేటా 30 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. దేశ, విదేశాల్లో ఆదిలాబాద్ పత్తికి మంచి డిమాండ్ కనిపిస్తోంది. అంతేకాకుండా సారవంతమైన నల్లరేగడి నేలలు, అనుకూలమైన వాతావరణంతో పత్తి దిగుబడులు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. దీంతో పత్తిలో మరిన్ని పరిశోధనలు అవసరమని భావించిన అధికారులు.. గత నాలుగైదేళ్ల క్రితమే పత్తి పరిశోధన కేంద్రం మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. కానీ మంజూరులో కాలయాపన జరుగుతూ వచ్చింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం అఖిల భారతీయ సమన్వయ పథకం(ఏఐసీఆర్‌పీ) కింద రెండు పత్తి పరిశోధన కేంద్రాలను మంజూరు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో వరంగల్‌లో ప్రధాన పరిశోధన కేంద్రం, జిల్లాకు ఉప పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా పత్తి రైతులకు మంచి రోజులు వచ్చాయని అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

అధిక దిగుబడులే లక్ష్యం

పత్తిలో అధిక దిగుబడులను సాధించే లక్ష్యంతో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే తెలంగాణ ఉత్తర జిల్లాలకు పత్తి పరిశోధన కేంద్రాలను మంజూరు చేసింది. దీంతో బీజీ-2 పత్తి విత్తనాల ఉత్పత్తికి అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. పలు రకాల పరిశోధనలతో పాటు పత్తి రైతులకు సలహాలు, సూచనలు, యజమాన్య పద్ధతులు ప్రధానంగా చీడపీడలు, ఇతర తెగుళ్లను గుర్తించి పత్తిలో అధిక దిగుబడులను సాధించే లక్ష్యంతో పరిశోధనలను చేపట్టనున్నారు. అలాగే పత్తి ఆధారిత పరిశ్రమల ఏర్పా టు, మార్కెట్ ప్రాధాన్యతను గుర్తించి నెలకొల్పే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 300 రకాల బీజీ-2 పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్న జిల్లాలో మాత్రం 8 నుంచి 10రకాల బీటీ విత్తన రకాలను సాగు చేస్తున్నారు. ఇప్పటికే 2018 నుంచి జిల్లాలో మెట్ట వ్యవసాయ పంటల పరిశోధన కేంద్రం (జలంటరీ సెంటర్)ను ఏర్పాటు చేసి పరిశోధనలు చేస్తున్నారు. ఆదిలాబాద్ కపాస్-1 (ఏడీబీ 542) నాన్ బీటీరకం పై పలు పరిశోధనలు చేశారు.ముఖ్యంగా రాశీ 659 పత్తి రకాన్ని రైతులు ఎక్కువగా సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే జిల్లా వాతావరణ పరిస్థితులకు ఈ రకం పత్తి విత్తనాలు అనుకూలంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

సోయాపై పరిశోధనలు

జిల్లాలో పత్తి పంట తర్వాత అధికంగా సాగయ్యే సోయ పంటలో ఇప్పటికే పరిశోధనలు జరుగుతున్నాయి. 2012లోనే జిల్లాలో సోయా పరిశోధన ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు బాసర, కొమురంభీం, ఆదిలాబాద్ ఇందూరు-1, సోయా మేలు రకం విత్తనాలను వృద్ధి చేశారు. ఇందులో బాసర రకం సోయా విత్తనం దేశవ్యాప్తంగా డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా జిల్లాతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌టు ఈ రకం విత్తనాలను అధికంగా సాగు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే అధికంగా సాగయ్యే శనగ పంటలోను మరిన్ని పరిశోధనలు జరిగితే జిల్లా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సోయా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో మేలు రకమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు.

ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు

పత్తి పరిశోధన కేంద్రం మంజూరుకు గత ఐదేళ్ల క్రితమే అధికారులు ప్రభుత్వానికి

(తరువాయి 6వ పేజీలో...)





పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న పత్తి పంట

..అందుకే అభిప్రాయ సేకరణ

- విద్యా వ్యవస్థలో సంస్కరణలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

6



శనగ పంటపై అన్నదాత ఆశలు

- తాంసి మండలంలో 3 వేల ఎకరాలలో సాగవుతున్న పంట
- ఈ యేడు శనగ పంట సాగుకు అనుకూలంగా వాతావరణం

7



చిరుజల్లులకు వణికిన రైతులు

- బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నాలుగు రోజులుగా అక్కడే అన్నదాతలు
- సోయాబీన్ బస్తాలు తడవకుండా టార్పలీన్ కవర్లతో పాట్లు

7





అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న పీవో ఖుష్బుగుప్తా

ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించిన ఐటీడీఏ పీవో

- గంగాపూర్‌లో ఒక టీచర్ సస్పెన్షన్

ఉట్నూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా శుక్రవారం ఆకస్మికం తనిఖీలతో హడలెత్తించారు. ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లు, ఐటీడీఏ పాఠశాలలను తనిఖీ చేశారు. నార్నూర్ మండలంలోని టీడబ్ల్యూపీఎస్, అంగన్‌వాడీ కేంద్రం దేవరిగూడ ప్రైమరీ స్కూల్ గంగాపూర్, టీడబ్ల్యూపీఎస్ నాగలకొండలను సందర్శించారు. దేవరగూడ పాఠశాల తెరవక పోవడం గమనించారు. టీడబ్ల్యూపీఎస్ గంగాపూర్‌లో మెనూ ప్రకారం భోజనం ఇవ్వనందుకు మిడ్ డే మిల్స్ ఏజెన్సీని రద్దు చేశారు. అలాగే టీడబ్ల్యూపీఎస్ గంగాపూర్‌లో యశ్వంత్ అనే ఉపాధ్యాయుడు విధులకు హాజరుకాకుండా తన స్థానం స్థానంలో వేరొక ఉపాధ్యాయుడిని స్వయంగా నియమించినందుకు గాను సెకండరీ గ్రేడ్ టీచర్ యశ్వంత్‌ను సస్పెండ్ చేశారు. తడిహత్నూర్ ఏసీఈఆర్సీకి షోకాస్ నోటీసు జారీ చేశారు. దేవరగూడ అంగన్‌వాడీ టీచర్ విధులలో అలసత్వం, మెనూ ప్రకారం భోజనం ఇవ్వనందుకు చర్యలు తీసుకోవాలని మహిళా సంక్షేమ శాఖ డీడీని ఆదేశించారు. అనంతరం ఉట్నూర్‌లోని మోల్ స్పోర్ట్స్ స్కూల్ బాలికల పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని గత వారం నుంచి అమలు చేస్తున్న డైట్‌ను ఐటీడీఏ పీవో పరిశీలించారు.



ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న పీవో

అంబేద్కర్ ఆశయ సాధనతో ముందుకెళ్లాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ● అంబేద్కర్ చౌక్‌లో ఘనంగా 68వ వర్ధంతి వేడుకలు ● పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, నాయకులు



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఏదేశానికి లేని రాజ్యాంగాన్ని భారతదేశానికి బాబా సాహెబ్ అంబేద్కర్ అందించారన్నారు. భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆయన ఆశలకు అనుగుణంగా మనమందరం ముందుకు కదలాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. అంబేద్కర్ బోధనలు, ఆలోచనలతో మనమందరం ముందుకు సాగాలని ఆయన ఈ సందార్భంగా సూచించారు. ఇందులో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

- **మార్కెట్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే**

ఆదిలాబాద్‌లోని మార్కెట్ యార్డును ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సోయా కొనుగోళ్లు, అలాట్మెంట్ పూర్తిస్థాయిలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సీసీఐకి సంబంధించి పత్తి కొనుగోళ్ల విషయంలో యజమాని స్వయంగా రావాలనే నిబంధనను అధికారులతో మాట్లాడి అన్నిఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి మధుకర్, బీజేపీ నాయకులు ఆధినాథ్ ఉన్నారు.

- **దేశానికి దిక్సూచి అంబేద్కర్ : ఎమ్మెల్యే బొజ్జు**

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తాడిత పీడత ప్రజల హక్కులకై పోరాడిన జ్ఞాన యోధుడు డా.బీఆర్ అంబేద్కర్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ 68వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. అలాగే, ఉట్నూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు వాఘ్మారే జగజీవన్, ప్రచార కార్యదర్శి జాడి వెంకటేష్‌నేత, ప్రధాన కార్యదర్శి బొంకంటి సుభాష్ ఆధ్వర్యంలో ఘన నివాళ్లు అర్పించారు. అలాగే, బీజేపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంచేలా కృషి చేయాలి : కలెక్టర్

- ఆదిలాబాద్‌లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్, సైన్స్ ఫెయిర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పట్టణంలోని కన్వెంట్ స్కూల్‌లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్, జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ముఖ్యఅథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనాలను తిలకించి తయారి విధానం, పని చేసే విధానాల గురించి తెలుసుకుంటు వారిని అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో యోగ పోటీల్లో 3వ స్థానం పొందిన సరస్వతి నగర్ జడ్పీఎస్ఎస్ విద్యార్థులు యోగ అసానాలు వేసి అబ్బురపరిచారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సైన్స్ ఫెయిర్‌లో జిల్లాలోని ఆయా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు సైన్స్ పరిజ్ఞానం కూడా ఎంతో ముఖ్యమన్నారు. పుస్తకాలు ఉన్న వాటిని వాస్తవిక రూపంలో సరిచూస్తు వినూత్నంగా ఆలోచిస్తూ.. సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, సెక్టోరియల్ అధికారి నారాయణ, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, కన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మారయ రోజ్, ట్రస్మా ప్రతినిధులు రంగినేని పవన్‌రావ్, ఆధినాథ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ గణన కోసం ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు

- కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ప్రభుత్వం గణన కోసం ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని బీసీ డెటికెటేడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో రిజర్వేషన్ల విషయంలో ఉమ్మడి జిల్లా బీసీ సంఘాలు, ఇతర నాయకులతో వినతులను స్వీకరించారు. ఆదిలాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్ బీసీ డెడికెటెడ్ కమిషన్ చైర్మన్‌కు విన్నపాలను అందజేశారు. కాగా మొత్తం 24 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం డెటికెటేడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఆదిలాబాద్‌తో కలిపి తొమ్మిది జిల్లాల పర్యటన పూర్తి అయిందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ కార్యదర్శి బి.సైదులు, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.



● మాట్లాడుతున్న బీసీ డెటికెటేడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు →